క్లుప్తంగా

అటవీ సంపద దోపిడీకే 'ఆపరేషన్ కగార్'

నెహ్రూసెంటర్: దేశంలోని అటవీ సందపను దోచుకునేందుకు ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీలను అన్యాయంగా కాల్చి చంపుతున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి ఆరోపించారు. పార్టీ మహాసభలు బుధవారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. మహాసభల్లో అజయ్‌సారథి రెడ్డి, పెరుగు కుమార్, ఎండీ ఫాతిమా, రేషపల్లి నవీన్, మామిండ్ల సాంబలక్ష్మి, నర్ర శ్రావణ్, వెలుగు శ్రావణ్ పాల్గొన్నారు.

టై, బెల్టుల పంపిణీ



కురవి: మండలంలోని సూధనపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు బుధవారం పాఠశాల విద్యార్థులకు టై, బెల్టులు, షూలు అందజేశారు. హైదరాబాద్‌కు వెళ్లి స్థిరపడిన వారంతా కలిసి యూనిట్ ఆఫ్ పవర్, సూధనపల్లి ఐక్యతే శక్తి అనే నినాదంతో ఒక యూనిటీగా ఏర్పడి గ్రామానికి ఏదో ఒకటి చేయాలనే ఉద్దేశంతో విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ధరావత్ వెంకన్న, టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు చిత్తనూరి శ్రీనివాస్, మలిశెట్టి వేణు, సూధనపల్లి ఐక్యతే శక్తి సభ్యులు నీలం రాజు, చిన్నబోయిన లక్ష్మణ్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సెంటర్ తనిఖీ

కేసముద్రం: ఇనుగుర్తి మండల కేంద్రంలోని ఐదు అంగన్‌వాడీ సెంటర్‌లతోపాటు, కేసముద్రం మండలం మహముద్‌పట్నం గ్రామంలో గల అంగన్‌వాడీ సెంటర్‌లను సీడీపీఓ శిరీష బుధవారం తనిఖీ చేశారు. ఈమేరకు రికార్డులను పరిశీలించారు. అనంతరం పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ దుర్గ, టీచర్‌లు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

పెద్దవంగర: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ సత్తా చాటాలని స్థానిక సంస్థల ఎన్నికల ఇన్‌చార్జ్ రంగు కుమార్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో మండల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆరు గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి హామీలను విస్మరించిందన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు రామచంద్రయ్య శర్మ, యాదగిరి రావు, సంజయ్, వెంకన్న, సమ్మయ్య, రఘు, రాజేందర్, దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

తొర్రూరు రూరల్: మండలంలోని అమ్మాపురం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్‌గా జీవనాన్ని సాగిస్తున్న మాచర్ల కిరణ్‌కుమార్‌గౌడ్ బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో వరంగల్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కిరణ్‌కుమార్‌గౌడ్‌ను కాపాడేందుకు గ్రామానికి చెందిన మాజీ ప్రజాప్రతినిధులు, పెద్దలు, స్నేహితులు, బంధువులంతా కలిసి రూ.45వేల ఆర్థిక సాయం బాధిత కుటుంబానికి బుధవారం అందించారు.

గూడూరులో..

గూడూరు: గ్రామపంచాయతీ పారిశుద్ధ్య కార్మికుడు కొమ్ముల వెంకన్న, ఆటో ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నిరుపేద మహిళ కొమురమ్మకు మాజీ సర్పంచ్, మాజీ ఎంపీపీ నూనావత్ రమేష్‌నాయక్, మాజీ ఎంపీటీసీ కత్తి స్వామి బాధిత కుటుంబాలకు బియ్యం, నగదు అందించారు. కార్యక్రమంలో కట్ల విష్ణుగౌడ్, హెచ్ శివ, మండల మల్లేష్‌యాదవ్, కన్నబోయిన వెంకన్న పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

మహబూబాబాద్ రూరల్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలని టౌన్ సీఐ గట్ల మహేందర్ రెడ్డి అన్నారు. పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా పలు ప్రాంతాల్లో పార్కింగ్ స్థలాలను గుర్తించగా వాటిని సీఐ బుధవారం పరిశీలించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పొలంబాట

గూడూరు: రైతు పంటల వద్ద విద్యుత్ సమస్యల పరిష్కారమే విద్యుత్ శాఖ లక్ష్యమని ఏడీఈ కె. కవిత అన్నారు. మండలంలోని బొల్లెపల్లిలో బుధవారం రైతు సమస్యల పరిష్కారంపై విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో విద్యుత్ ఏఈ మెట్టురాం, లైన్ ఇన్‌స్పెక్టర్ భీముడు, ఏఎల్‌ఎంలు సంతోష్, రాకేష్, రైతులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత

మహబూబాబాద్ రూరల్: ప్రభుత్వ పాఠశాలలో చదువుకోవడం అదృష్టంగా భావించాలని ఢిల్లీ జవహర్ లాల్ నెహ్రూ యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ తంగెళ్లపల్లి మహేందర్ అన్నారు. మండలంలోని వేమునూర్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం నవోదయ స్టడీ మెటీరియల్ అందజేశారు.

ఒంటికి, రెంటికి ఇబ్బందులు..

- అసంపూర్తిగా మరుగుదొడ్ల నిర్మాణాలు
- నిధుల లేమితో మధ్యలోనే ఆగిన పనులు

కురవి: మండలంలోని పలు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో టాయ్‌లెట్స్ నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. మండల కేంద్రంతోపాటు సూదనపల్లి తదితర గ్రామాల్లోని పాఠశాలల్లో మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్మాణ పనులను గత ప్రభుత్వ హయాంలో మన ఊరు-మనబడి కార్యక్రమంలో ప్రారంభించారు. వాటికి నిధులు మంజూరు చేయకపోవడంతో కాంట్రాక్టర్లు పనులను మధ్యలో నిలిపివేశారు. దీంతో పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో మూత్రశాలలు, మరుగుదొడ్లు వినియోగంలోకి రాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. బాలికలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుంది. వీరికి తోడు మహిళా ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. నిధులు కేటాయించి పనులను పూర్తి చేస్తేనే అందరికి ఉపయోగపడుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. లేకుంటే వానాకాలంలో విద్యార్థులు నానా అవస్థలు పడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు.



కురవి: సూదనపల్లి యూపీఎస్‌లో అసంపూర్తిగా ఉన్న టాయ్‌లెట్స్



కురవిలో నిర్మాణంలో మూత్రశాలలు



కురవిలో నిరుపయోగంగా ఉన్న నిర్మాణాలు

ఆందోళన చేస్తాం..

ప్రభుత్వ పాఠశాలల్లో మూత్రశాలల సమస్యను పరిష్కరించాలి. జిల్లాలో అసంపూర్తిగా ఉన్న మరుగుదొడ్ల నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయించాలి. లేకుంటే పాఠశాలల సమస్యలపై ఆందోళన కార్యక్రమాలు చేపడతాం.

– గంధసిరి జ్యోతిబసు, ఎస్‌ఎఫ్‌ఐ నాయకుడు

బడుల అభివృద్ధికి సహకారం అవసరం

- డీఈఓ రవీందర్‌రెడ్డి

కురవి: ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోనే ఉత్తమ బోధన అందుతున్నదని బడుల అభివృద్ధికి దాతలు, తల్లిదండ్రుల సహకారం ఎంతో అవసరమని డీఈఓ రవీందర్‌రెడ్డి అన్నారు. పాఠశాలలో హెచ్‌ఎం తేలుకుంట్ల సునీత అధ్యక్షతన జరిగిన బడిబాట 2025–2026 విద్యాసంవత్సరానికి గాను ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లే 54 మంది విద్యార్థులను ప్రాథమిక పాఠశాలలో చేర్చుకున్నారు. విద్యార్థులను బడిలో చేర్పించిన హెచ్‌ఎం సునీతను, బడిబాటలో పాల్గొని విద్యార్థుల నమోదు కోసం కృషి చేసిన నామ వెంకటేశ్వర్లు, దైద వెంకటేశ్వర్లు, లోడంగి పురుషలింగం, పత్తేపురపు నాగరాజు, పయ్యావుల వెంకటేశ్వర్లు, ఈడిగిరాల విష్ణువర్ధన్, పొన్నం ఉపేందర్, కన్నోజు నవీన్, బరిగెల ఉమ, చెరుకుపల్లి పద్మలను సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ వి.బాలాజీ, హెచ్‌ఎంలు మధుసూదన్ రెడ్డి, షమదాన్వాడీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈఓ రవీందర్‌రెడ్డి

పేదల ఐక్యతను దెబ్బతీస్తున్న కులవ్యవస్థ



మాట్లాడుతున్న స్కైలాబ్‌బాబు

నెహ్రూసెంటర్: సమాజంలో పేదల ఐక్యతను దెబ్బతీసే విధంగా కుల వ్యవస్థ తీవ్రంగా పని చేస్తుందని, సమాజంలో అంటరాని తనం, కుల వ్యవస్థతకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తొప్పెట్ల స్కైలాబ్‌బాబు అన్నారు. సంఘం జిల్లాస్థాయి శిక్షణ తరగతులు జిల్లా కేంద్రంలో బుధవారం ప్రారంభమయ్యాయి. ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ కార్పొరేషన్, సబ్‌ప్లాన్ అమలు చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలన్నారు. ప్రభుత్వ వైద్యం ప్రజలకు అందుబాటులో లేకుండా పోతుందని, సంక్షేమ హాస్టళ్లు, పాఠశాలలకు సౌకర్యాలు కల్పించాలని సంఘం పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, చీపిరి యాకయ్య, దుడ్డెల రామ్మూర్తి, చింత ఎల్లయ్య, జిన్న లచ్చయ్య, మందుల యాకుబ్, నిదిగొండ చంటి పాల్గొన్నారు.

ప్రభుత్వ విధానాలపై సమరశీల పోరాటాలు

నెహ్రూసెంటర్: ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక ప్రభుత్వ విధానాలపై సమరశీల పోరాటాలు నిర్వహించాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి పాయం చిన్న చంద్రన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం తీసుకువస్తున్న నూతన సంస్కరణలతో కార్మికులు, రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి డీవీ కృష్ణ వర్ధంతి సభలను నేటి నుంచి 29వ తేదీ వరకు గ్రామగ్రామాన నిర్వహించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి, నాయకులు పూనెం ప్రభాకర్, ముంజంపల్లి వీరన్న, బిల్లకంటి సూర్యం, ఉమ్మగాని సత్యం, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చిన్న చంద్రన్న

సద్వినియోగం చేసుకోవాలి

కురవి: దివ్యాంగులైన చిన్నారులు ఫిజియోథెరపీ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ నిశాంత్ అన్నారు. బుధవారం స్థానిక ఎమ్మార్సీ భవనంలో ఫిజియోథెరపీ క్యాంపును నిర్వహించారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

- అడిషనల్ డీఆర్డీఓ శ్రీనివాస్

మహబూబాబాద్ రూరల్: గ్రామీణ ప్రాంతాల స్వయం సహాయక బృందాల మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని అడిషనల్ డీఆర్డీఓ శ్రీనివాస్ అన్నారు. మానుకోట జిల్లా సమాఖ్య కార్యాలయంలో ఆర్‌ఏఎంపీ అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా అడిషనల్ డీఆర్డీఓ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఎస్‌హెచ్‌జీ బృందాల మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో ఒక రోజు అవగాహన సదస్సు నిర్వహించామని తెలిపారు. ఔత్సాహిక మహిళలకు అవగాహన సదస్సు అనంతరం పదిహేను రోజుల పరిశ్రమ నిర్వహణ, ఉత్పత్తుల మార్కెటింగ్ మెలకువలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇస్తారని తెలిపారు. ఈ సదస్సులో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ శ్రీమన్నారాయణ, ఏపీఎంలు తిలక్, శ్రీనివాసరావు, బాబు, జిల్లా సమాఖ్య అధ్యక్షులు, అలీప్ కమిటీ సభ్యురాలు, అన్నపూర్ణ, తదితరులు పాల్గొన్నారు.



మహబూబాబాద్ రూరల్: మాట్లాడుతున్న అడిషనల్ డీఆర్డీఓ శ్రీనివాస్

తొర్రూరు: మహిళలు పారిశ్రామికవేత్తలు ఎదగాలని అలీప్ సంస్థ చైర్‌పర్సన్ రజినికుమారి తెలిపారు. డీఆర్‌డీఏ, అలీప్ సంస్థల ఆధ్వర్యంలో బుధవారం డివిజన్ కేంద్రంలోని రైతువేదికలో మహిళా స్వయం సహాయక సభ్యులకు చిరు పరిశ్రమల ఏర్పాటుపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఎం సంజీవరావు, సంస్థ కోఆర్డినేటర్ రాధ, ఏపీఎం వీరయ్య, డీఆర్‌డీఏ ఈజీఎంఎం గణేష్ పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో జీవితాలు ఛిన్నాభిన్నం

మహబూబాబాద్ అర్బన్: మత్తుపదార్థాలతో విద్యార్థులు, యువత బతుకులు ఛిన్నాభిన్నం అవుతున్నాయని, యువత బంగారు భవిష్యత్ నాశనం చేసుకోవద్దని షీటీం ఎస్సై సునంద అన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు బుధవారం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో డ్రగ్స్ నియంత్రణ వారోత్సవాల సందర్భంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సిరి నాయక్, ఉపాధ్యాయులు వాసుదేవ్, రవీందర్, ఉమెన్ సెల్ ఎస్సై ఆనందం, రమేష్, పార్వతి, సౌభాగ్య పాల్గొన్నారు.

బయ్యారం: విద్యార్థులు మాదకద్రవ్యాలకు అలవాటు పడితే బంగారం లాంటి జీవితాలు ఛిన్నాభిన్నం అవుతాయని డీఎస్పీ తిరుపతిరావు అన్నారు. మండలంలోని నామాలపాడు ఏకలవ్య పాఠశాల ఆవరణంలో బుధవారం మాదకద్రవ్యాల వినియోగంకు వ్యతిరేకంగా నిర్వహించిన అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో కలిసి పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటారు. సీఐ రవికుమార్, ఎస్సై తిరుపతి పాల్గొన్నారు.

వ్యసనాలకు బానిసలు కావద్దు

డోర్నకల్: యువత మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని డోర్నకల్ సీఐ బి.రాజేష్ కోరారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో బుధవారం డ్రగ్స్, మత్తు పదార్థాలపై స్థానికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్సై గడ్డం ఉమా, ఏఎస్సై కోటేశ్వరరావు పాల్గొన్నారు.

కురవి: మత్తు యువత భవిష్యత్‌ను చిత్తుచేస్తుందని ఎస్సై గండ్రాతి సతీష్ అన్నారు. బుధవారం మండలంలోని నేరడ మోడల్ స్కూల్, కళాశాలలో విద్యార్థులకు డ్రగ్స్ వలన కలిగే అనర్థాలపై అవగాహన సమావేశం నిర్వహించారు.

గూడూరు: డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతీ ఒక్కరు పోరాడాలని సీఐ సూర్యప్రకాష్ అన్నారు. మండల కేంద్రంలోని అరవింద, ప్రభుత్వ బాలుర హైస్కూల్‌లో బుధవారం డ్రగ్స్ వ్యతిరేక వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్సై గిరిధర్ రెడ్డి, పీఎస్సై, ఏఎస్సై, హెడ్‌కానిస్టేబుల్, సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బయ్యారం: మొక్క నాటుతున్న డీఎస్పీ తిరుపతిరావు



డోర్నకల్: వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐ రాజేష్

యువత సన్మార్గంలో పయనించాలి

నెహ్రూసెంటర్: యువత, విద్యార్థులు డ్రగ్స్, చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ సన్మార్గంలో పయనించాలని టౌన్ సీఐ జి.మహేందర్‌రెడ్డి సూచించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో విద్యార్థులకు బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సూచిస్తూ పోస్టర్లను ఆవిష్కరించారు.

కొత్తగూడ: మండలంలోని క్రీడా పాఠశాల, ఏకలవ్య గురుకుల జూనియర్ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఎస్సై కుశకుమార్ మాదక ద్రవ్యాల నియంత్రణపై అవగాహన కల్పించారు.

సంక్షిప్త సమాచారం

ఆలయ అభివృద్ధికి విరాళం



గార్ల: గార్లలోని ముత్యాలమ్మ ఆలయ అభివృద్ధికి దాత పతంగి సురేష్ ఆయన తల్లితండ్రులు దేవోజీ, సక్కుబాయిల జ్ఞాపకార్థం రూ.25వేలను ఆలయ నిర్వాహకులకు అందజేశారు. అదేవిధంగా బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్‌నాయక్ తన సొంత ఖర్చులతో తాగునీటి కోసం బోరు వేయిస్తానని హామీ ఇచ్చారు.

అభినందనీయం

మరిపెడ రూరల్: పేద విద్యార్థులకు దాతలు చేయూతనందించడం అభినందనీయమని బావోజిగూడెం యూపీఎస్ హెచ్‌ఎం గుగులోతు మంగు అన్నారు. బుధవారం పాఠశాల విద్యార్థులకు వందేమాతం ఫౌండేషన్ తొర్రూరు వారి సహకారంతో పలకలు పంపిణీ చేశారు. ఫౌండేషన్ అధ్యక్షుడు రవీందర్, ఉపాధ్యాయులు నవీత, లక్ష్మీనారాయణ, శ్రావణ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

పార్ట్ టైం ఉద్యోగులను రెన్యువల్ చేయాలి

మహబూబాబాద్ రూరల్: తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకులాల్లో పనిచేస్తున్న తమను రెన్యువల్ చేయాలని కోరుతూ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల పార్ట్ టైం ఉద్యోగుల సంఘం బాధ్యులు ఈశ్వరయ్య, ఉప్పలయ్య, మల్లయ్య బుధవారం హైదరాబాదులో కలిసి వినతిపత్రం అందజేశారు.

రోడ్డు వెడల్పు తగ్గించాలి

కేసముద్రం: మున్సిపాలిటీ పరిధిలో చేపట్టనున్న రోడ్డు విస్తరణ పనులను 100 ఫీట్లు కాకుండా, 60 ఫీట్ల వెడల్పు వరకే రోడ్డును ఏర్పాటు చేయాలంటూ బుధవారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వోలం శ్రీనివాస్, శ్రీనివాసరావు, గుణగంటి అశోక్, యాదగిరి పాల్గొన్నారు.

విద్యా సామర్థ్యాల పెంపునకు కృషి చేయాలి

దంతాలపల్లి: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో హెచ్‌ఎంలు ముందుండాలని ఎంఈఓ శ్రీదేవి అన్నారు. మండలకేంద్రంలో గల జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో బుధవారం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. విద్యా సామర్థ్యాల పెంపునకు ఉపాధ్యాయులు ప్రణాళికతో కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు వేణు మాధవరెడ్డి, కృష్ణయ్య పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకోవాలి

దంతాలపల్లి: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు తమ ఇంటిని త్వరగా పూర్తి చేసుకోవాలని ఎంపీడీఓ వివేక్‌రామ్ అన్నారు. మండలంలోని కుమ్మరికుంట్ల, బొడ్లాడ గ్రామాలలో బుధవారం ఆయన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. త్వరగా ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకుంటే ప్రభుత్వం బిల్లులు ఇస్తుందన్నారు.

ఇందిరమ్మ ఇంటి పత్రాల పంపిణీ

కురవి: మండలంలోని రాజోలు గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు బుధవారం ఇళ్ల పట్టాలను కాంగ్రెస్ డోర్నకల్ నియోజకవర్గ కోఆర్డినేటర్ బండి శ్రీనివాస్ గౌడ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి మంజుల, నాయకులు అంబటి గోవర్ధన్ గౌడ్, అంబటి అనూష విష్ణువర్ధన్ గౌడ్, కొక్కు శ్రీనివాస్, మేకల గంగాధర్ యాదవ్ పాల్గొన్నారు.

సమ్మె నోటీస్ అందజేత

గూడూరు/గార్ల: కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు, లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జూలై 9న దేశ వ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకుడు ఎండి. మోహినోద్దిన్ అన్నారు. బుధవారం ఎంపీడీఓ వీరస్వామికి సమ్మె నోటీస్ అందించారు.

కాంగ్రెస్‌వి మోసపూరిత హామీలు

చిన్నగూడూరు: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు మోసపూరిత హామీలు ఇచ్చి రైతు పేరిట సంబురాలు జరుపుకోవడం విడ్డూరమని సేవాలాల్ సేన మండల ఇన్‌చార్జ్ బాదావత్ సురేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

శాంతిచర్చలు జరపాలి

బయ్యారం: మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం శాంతిచర్చలు జరపాలని సీపీఎం జిల్లా నాయకుడు మండా రాజన్న డిమాండ్ చేశారు. బుధవారం బయ్యారంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో నాయకులు మధు, నాగేశ్వరరావు, వెంకన్న, తిరుపతిరావు, పురుషోత్తం పాల్గొన్నారు.

సౌండ్ సిస్టం బహూకరణ



డోర్నకల్: స్థానిక మైనారిటీ గురుకుల బాలికల పాఠశాలకు ప్రముఖ వ్యాపారి సురేందర్ జైన్ సౌండ్ సిస్టంను బుధవారం బహూకరించాడు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రిజ్వానా, జ్యోత్స్న, రేచెల్, అనూష, రమ, దీప్తి పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం..

తొర్రూరు రూరల్: కాంగ్రెస్ బలోపేతం కోసం నిరంతరం పని చేస్తూ, ఆపదలో ఉన్న కార్యకర్తలకు అండగా ఉంటామని కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి హామీ ఇచ్చారు. బుధవారం మండలంలోని తొర్రూరు, అమ్మాపురం, గుర్తూరు గ్రామాల్లో పలు బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం చేశారు.

పాఠశాల తనిఖీ

కేసముద్రం: మండలంలోని అన్నారం యూపీఎస్, ధర్మారంతండా, తాళ్లపూసపల్లి ప్రాథమిక పాఠశాలలను ఎంఈఓ కాలేరు యాదగిరి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు బత్తుల శ్రీధర్, నాగనబోయిన వెంకటేశ్వర్లు, బాణాల ప్రమీల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులను అరికట్టాలి

గార్ల: గ్రామాల్లో సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు కార్యదర్శులకు బుధవారం వినతిపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్‌నాయక్, శీలంశెట్టి రమేష్, గాజుల గణేష్, ధరావత్ సక్రు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి



చిన్నారులతో ఝాన్సీరెడ్డి

తొర్రూరు: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని వేటా (ఉమెన్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ తెలుగు అసోసియేషన్) అధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. డివిజన్ కేంద్రంలోని నితిన్ భవన్‌లో వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో అక్షరాభ్యాస కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వ పాఠశాలలకు 10వేల పలకల పంపిణీని ప్రారంభించారు. పలువురు చిన్నారులకు ఝాన్సీరెడ్డితో అక్షరాభ్యాసం చేయించారు. ఫౌండేషన్ డైరెక్టర్ తక్కెళ్లపల్లి రవీంద్రతో కలిసి ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే బిడ్డల అభ్యున్నతికి వందేమాతరం ఫౌండేషన్ చేస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి పాటుపడుతుందని, దానిలో భాగంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకులాలను ఏర్పాటు చేస్తోందన్నారు. ఫౌండేషన్ చేస్తున్న కార్యక్రమాలకు చేయూతనందించేందుకు ఝాన్సీరెడ్డి రూ.లక్ష విరాళం ప్రకటించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, వీఎంఎఫ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎమర్జెన్సీతో కాంగ్రెస్ నిరంకుశ పాలన


మహబూబాబాద్ అర్బన్: కాంగ్రెస్ పార్టీ నిరంకుశ పాలనకు ఆనాటి ఎమర్జెన్సీ విధించడం కాంగ్రెస్ పార్టీ చేసిన చారిత్రక తప్పిదమని బీజేపి జిల్లా కౌన్సిల్ సభ్యులు గడ్డం అశోక్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో బుధవారం పట్టణ అధ్యక్షుడు వెన్నమల అజయ్ అధ్యక్షతన ఎమర్జెన్సీ విధించి 50 ఏళ్లు అయిన సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి గడ్డం అశోక్ కుమార్ హాజరై మాట్లాడుతూ.. ఇందిరాగాంధీ ప్రభుత్వం నిరంకుశంగా ప్రభుత్వ సొమ్మును వాడుకొని ఎన్నికల్లో గెలిచిన సందర్భంగా ఆమె గెలుపునకు అలహాబాద్ కోర్టు చెల్లదని తీర్పు ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు శ్యామ్ సుందర్ శర్మ, సందీప్, పట్టణ నాయకులు నరేష్ నాయక్, నాయని కృష్ణమోహన్, సుధాకర్, రవి, శ్యాంప్రసాద్ పాల్గొన్నారు.

కేసముద్రం: మాజీ ప్రధాని ఇందిరాగాంధీ దేశంలో విధించిన ఎమర్జెన్సీ చీకటి అధ్యాయానికి నేటితో 50 ఏళ్లు అయిందని బీజేపీ మండల అధ్యక్షుడు ఉప్పునూతల రమేశ్ విమర్శించారు. బుధవారం మున్సిపల్ కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి వోలం శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు రడం వెంకన్న, సహాయ కార్యదర్శి రామడుగు వెంకటాచారి, నాగేశ్వరాచారి పాల్గొన్నారు.



మహబూబాబాద్ అర్బన్: మాట్లాడుతున్న గడ్డం అశోక్

మద్యం, గుట్కా ప్యాకెట్ల స్వాధీనం



పట్టుబడిన మద్యం, గుట్కాను చూపుతున్న ఎస్సై

బయ్యారం: మండలంలోని రామచంద్రాపురం (రామగుండాల)లో బుధవారం ఎస్సై తిరుపతి ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. బెల్ట్‌షాపుల్లో అక్రమంగా నిల్వ ఉంచిన 7వేల విలువైన మద్యం, 5వేల విలువైన గుట్కా, 10లీటర్ల గుడుంబా, 500లీటర్ల బెల్లంపానకంను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం గ్రామస్తులకు ట్రాఫిక్ రూల్స్, సైబర్‌క్రైం గురించి ఎస్సై అవగాహన కల్పించారు. ఇదేవిధంగా సరైన అనుమతి పత్రాలు లేని 20వాహనాలను సీజ్ చేయడంతోపాటు గుడుంబా, గుట్కాలు విక్రయిస్తున్న నలుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్సై పుల్లారావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మొండి బకాయిలు వసూలు చేయాలి

మరిపెడ రూరల్: మరిపెడ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని షాపింగ్ కాంప్లెక్స్ లక్షల రూపాయల మొండి బకాయిలను తక్షణ వసూలు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి బాలకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ.. కాంప్లెక్స్‌లో 20 షాపుల యజమానులు నెలల తరబడి కిరాయిలు చెల్లించడం లేదన్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతుందని మండిపడ్డారు. సమయానికి కిరాయిలు చెల్లించని షాపులకు తక్షణమే నోటీసులు ఇచ్చి ఖాళీ చేయించాని ఎంపీడీఓను కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు ఎండీ అబ్దుల్ రషీద్, పట్టణ కార్యదర్శి మల్లెపాక యాకన్న, సత్తెయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాలకృష్ణ

వ్యవసాయబావిలో పడి యువకుడి మృతి

కేసముద్రం: ప్రమాదవశాత్తు వ్యవసాయబావిలో పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని పెనుగొండ గ్రామంలో చోటుచేసుకుంది. బుధవారం ఎస్సై మురళీధర్‌రాజు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పోశెట్టి వీరేష్(22)అనే యువకుడు తాగుడుకు బానిసై, ఎలాంటి పనిచేకుండా తిరుగుతుండడంతో తల్లి అమృత మందలించింది. దీంతో ఈనెల 23న వీరేష్ తల్లికి చెప్పి బయటికి వెళ్లాడు. తిరిగి రాలేదు. గ్రామ శివారులోని ఓ రైతు వ్యవసాయబావిలో వీరేష్ మృతదేహం తేలి ఉండటాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలాన్ని చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి, పోస్టుమార్టం నిమిత్తం మానుకోట జనరల్ ఆసుపత్రికి తరలించారు. కాగా వ్యవసాయబావి వైపు వెళ్లిన అతడు ప్రమాదవశాత్తు బావిలో జారిపడి మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.